
# * మాట్లాడితే ఒట్టు *

ప్రొడ్యూసరు పరాంకుశం, ప్రొడక్షన్ అసిస్టెంటు వెంకటేశం ఆ కాలనీలోని ఇళ్లన్నీ వరుసగా చూసుకుంటూ నెమ్మదిగా నడుస్తున్నారు.

"అదిగోండిసార్....ఆ యిల్లే" అని అరిచాడు వెంకటేశం పసుపుపచ్చరంగు డాబా ఇంటివంక చూపిస్తూ.




ప్రొడ్యూసరు పరాంకుశం అటువైపు చూశాడు. ఆ ఇంటిముందు వి.శంభుశ్రీ, రచయిత అని బోర్డుంది.

ఇద్దరూ లోపలికి అడుగు పెట్టారు. కాలింగ్ బెల్ నొక్కారు.

పొట్టిగా లావుగా బట్టతలతో ఉన్న ఒక వ్యక్తి తలుపు తీశాడు.

"మీ అయ్యగార్ని పిలు" అన్నాడు పరాంకుశం.

బట్టతలాయన ఒక్క పెట్టున నవ్వాడు.

"భలే దెబ్బతిన్నారండీ.....నన్ను పనివాడని అనుకున్నారు కదూ నా అవతారం చూసి...? హహహ.. నేనే అయ్యగార్ని.....మీరెవరు?...." అన్నాడు నవ్వునాపుకుంటూ.

బట్టతలాయన ముఖాన ఉన్న మసిని, చిరిగిన బనీనునీ, మాసిన లుంగీని తేరిపార చూస్తూ చెప్పాడు పరాంకుశం:

"నా పేరు పరాంకుశం. రేడియోలో ప్రొడ్యూసరుగా పంజేస్తున్నా, ఇతను

నా అసిస్టెంటు... వెంకటేశం."

రేడియోస్టేషను పేరు చెప్తూనే వి.శంభుశ్రీ చాల హడావిడి పడిపోయాడు.

"రండిసార్.... రండి ...అలా బయటే నిలబడిపోయారేం?...."

ముగ్గూరూ కూర్చున్నారు వరండాలో.

"చెప్పండి సార్... ఏం పని మీద వచ్చారు?"

"మిమ్మల్ని రేడియోలో ఇంటర్వ్యూచేసి మా శ్రోతలకి పరిచయం చేద్దామనే ఉద్దేశంతో వచ్చాం" అన్నాడు వెంకటేశం పరాంకుశం వంక చూస్తూ.

పరాంకుశం చిరునవ్వుతో తలూగించాడు.

"మీ ఉద్దేశం చాలా బాగుంది సార్... నిజంగా సార్... చాలా బాగుంది."

ఉబ్బితబ్బిబ్బు అయిపోతూ అన్నాడు వి. శంభుశ్రీ.

"మీ పేరు వి.శంభూశ్రీ కదా! 'వి' అంటే ఏమిటండీ..? అదే.... మీ ఇంటిపేరు?" అడిగాడు పరాంకుశం.

"వసపిట్టలవారు. అదేనండీ మా ఇంటిపేరు."

లేచినిలబడ్డాడు వెంకటేశం. పరాంకుశం వెంకటేశం చెయ్యిపట్టుకుని కూర్చోబెట్టాడు. శాంతించమన్నట్టుగా కళ్లతో సైగచేశాడు.

"ఇంటిపేరేగా వసపిట్టలవారు!...... భయం దేనికీ? అంతా చూస్కోడానికి నేనున్నానుగా. మరేం భయం లేదు.... అంతా మేం చూసుకుంటాం. మీ ఇంటర్వ్యూ ప్రోగ్రాం ఉన్నట్టే...." అన్నాడు పరాంకుశం.

శంభుశ్రీ తెగ సంబరపడిపోయాడు. "ఉండండి సార్.... కాఫీ తీసుకుని వస్తాను."

లోపలికి పరుగెత్తాడు శంభుశ్రీ. రెండు నిముషాల తరువాత లోపలినుండి కేకలు వినిపించాయ్.

"నీ సంపాదనకి ఇంటికొచ్చిన వాళ్లందరికీ కాఫీలిస్తే అయినట్టే....." ధన్...

"హబ్బా..."

"పో అవతలకి"

పదిసెకన్ల తరువాత శంభుశ్రీ బయటికి వచ్చాడు.

"హిహిహి.... ఎందుకో మిమ్మల్ని చూస్తుంటే కాఫీ అలవాటు ఉన్నవాళ్ళలా కనబడ్డంలేదు...." అన్నాడు ఆశ్చర్యంగా చూస్తున్న పరాంకుశం, వెంకటేశాల వంక చూస్తూ.

"అబ్బే..... మాకు కాఫీ అలవాటుందిగానీ మీరేమీ మాకు కాఫీ ఇవ్వనవసరం లేదు. మీ ఇంటర్వ్యూ రేడియోలో వచ్చేవారం ఉంటుంది. మీరు

రేపు మధ్యాహ్నం రేడియోస్టేషనుకి రండి. రికార్డింగ్ చేద్దాం" అన్నాడు పరాంకుశం.

"అలాగే సార్...." బట్టతల తడుముకుంటూ అన్నాడు శంభుశ్రీ.

వాళ్లిద్దరూ వెళ్లిపోయారు.

మర్నాడు మధ్యాహ్నం శంభుశ్రీ రేడియోస్టేషన్‌కి వెళ్లాడు. అతన్ని పరాంకుశం, వెంకటేశం రిసీవ్ చేసుకుని రికార్డింగ్ రూములోకి తీసుకెళ్లారు. వెంకటేశం టేప్ డెక్ మీద స్పూల్ టేపు సిద్ధంగా పెట్టుకున్నాడు ఇంటర్వ్యూ రికార్డు చెయ్యడం కోసం. పరాంకుశం శంభుశ్రీ ఎదురుగా కూర్చున్నాడు అతన్ని ఇంటర్వ్యూ చెయ్యడం కోసం. వాళ్లిద్దరి మధ్య బల్లమీద మైకు ఉంది.

ఇంటర్వ్యూ మొదలయింది.

"నమస్కారమండీ శంభూశ్రీగారూ!"

"నమస్కారమండీ పరాంకుశంగారూ!"

టేపు తిరుగుతూంది.

"ప్రముఖ రచయిత అయిన మీ గురించిన వివరాలు తెలుసుకోవాలని మా శ్రోతలు చాలా ఉవ్విళ్లూరుతున్నారండి..."

"హిహిహి..."

"పాఠకులు బాయ్‌మీట్ గర్ల్ నవలలు, సెంటిమెంటు నవలల్తో విసుగెత్తిపోయారు. అందుచేతనే మీరు దెయ్యాల నవలలు, భూతాల నవలలు, సస్పెన్సు నవలలు రాయడం మొదలుబెట్టారు వెరైటీ కోసం. అవునంటారా?" పరాంకుశం అడిగాడు.

శంభుశ్రీ దీర్ఘంగా ఊపిరిపీల్చి అందుకున్నాడు:

"అసలు మొట్టమొదట నేను రచయితగా నా జీవితం ప్రేమ కథలూ సెంటిమెంటల్ కథలతోనే ప్రారంభించానండి.... తరువాత్తరువాత ఏమైందంటే - నాలో ఒకవిధమైనటువంటి..."

"కా....ట్...." గట్టిగా రంకెవేశాడు పరాంకుశం.

టేపు ఆగిపోయింది.

శంభుశ్రీ బిక్కమొహం వేస్కుని చూశాడు.

"ఏంటండీ ఇది?... నేనడిగిందేమిటి, మీరు చెప్తున్నదేమిటి?..."

"ఏంసార్.... నేను తప్పుగా ఏమీ మాట్లాడలేదే!" ఆశ్చర్యంగా చూస్తూ అన్నాడు శంభుశ్రీ.

"అసలు మిమ్మల్ని మాట్లాడమన్నదెవరయ్యా?.... నేనేమడిగాను? సస్పెన్సు నవలలు వెరైటీ కోసం రాయడం మొదలుబెట్టారా అన్నాను. 'అవును' అని ఒక్క పదంతో చెప్పకుండా ఈ సోదంతా ఏమిటి?.... మొదట్నుండి మొదలుబెడ్దాం...."

"అలాగే సార్..."

వెంకటేశం టేపు మళ్లీ ఆన్ చేశాడు.

ఇంటర్వ్యూ మళ్లీ మొదలయింది. మళ్లీ నమస్కారాలయ్యాయి. ఇందాక అడిగిన ప్రశ్నే పరాంకుశం శంభుశ్రీని అడిగాడు.

"అవునండీ...." బిక్కమొహం వేస్కొని ఒక్కపదంతో జవాబు చెప్పాడు శంభుశ్రీ.

"కొందరేమో క్రైమ్ నవలలు రాస్తారు. కొందరేమో ప్రేమ నవలలు రాస్తారు. మరి కొందరు భార్యాభర్తల అనుబంధం గురించి నవలలు రాస్తారు. ఎవరు ఎన్ని రకాలుగా ఎన్ని నవలలు రాసినా వారి రచనల్లో తమ జీవితానుభవాలు ప్రతిబింబించి తీర్తాయి. మీ రచనల్లో కూడా మీ జీవితానుభవాలు ప్రతిబింబిస్తాయని నేనంటాను. మీరేమంటారు?"

కొంటెగా శంభుశ్రీ వంక చూస్తూ ప్రశ్నించాడు పరాంకుశం.

"జీవితానుభవం అంటే నాకు నా చిన్నప్పటి సంఘటన గుర్తుకు వస్తోంది....."

"హర్రే!...." గట్టిగా ఆశ్చర్యపోయాడు పరాంకుశం.

వెంకటేశం నెత్తికొట్టుకుంటూ టేపు ఆపుచేశాడు.

"మళ్లీ ఏమైందండీ?" తెల్లమొహం వేశాడు శంభుశ్రీ.

"నేనేమో మీ రచనల్లో కూడా మీ జీవితానుభవాలు ప్రతిబింబిస్తాయని నేనంటాను, మీరేమంటారు? అని అన్నాను. దానికి మీరు 'అవునంటాను' అని అనాలిగానీ అనవసరంగా మాట్లాడతారేంటి?" కోపంగా అన్నాడు పరాంకుశం.

వెంకటేశం చికాకుగా అన్నాడు:

"నేను చెప్పానా గురూగారూ ఈయన మనకి పనికిరాడని. అసలే ఇంటిపేరు 'వసపిట్టలవారు'. ఆ ఇంటిపేరు చెప్పినప్పుడే అనుమానించాను."

"మీరు మాట్లాడకూడదండీ శంభుశ్రీగారూ!" అనునయిస్తూ అన్నాడు పరాంకుశం.

"మరి మాట్లాడకపోతే ఇంటర్వ్యూ ఎలా అవుతుందండీ?"

వెంకటేశం, పరాంకుశం మొహమొహాలు చూస్కొని ఘోల్లుమని నవ్వారు.

"మీరు రచయితలైనా కూడా ఇంత అమాయకులేంటండీ? మీరు మాట్లాడడం ఎందుకూ, దానికి మేమున్నాంగా. మీరు అవును, కాదు అని మాత్రమే జవాబులు ఇవ్వడానికి వీలుండే ప్రశ్నలనే అడుగుతాం....అయినా మీరెప్పుడూ రేడియోలో ఇంటర్వ్యూలు వినలేదూ?.... ఇంటర్వ్యూ చేసేవాళ్లే ఎక్కువ మాట్లాడాలి..." అన్నాడు పరాంకుశం నవ్వుతూ.

"కాని, ఇంటర్వ్యూ చేయబడేవాళ్లు కూడా కాసింత మాట్లాడితే బావుంటుంది కాదండీ...." దీనంగా అడిగాడు శంభుశ్రీ.

"రట్ వీల్లేదు. ఎలా బావుంటుందయ్యా? నీది అడిషన్డు వాయిస్సా ఊర్కే మాట్లాడ్డానికి?"

"అంటే ఏంటండీ?"

"అంటే రేడియోవాళ్ళు మీ వాయిస్‌ని టెస్ట్ చేసి మీది మైక్రోఫోనిక్ వాయిస్ అని అన్నారా ఎప్పుడైనా?"

"లేదండీ...."

"మరి? అందుకే మీరు అసలు మాట్లాడకూడదు. మావి అందమైన గొంతులు కాబట్టి మేం మాట్లాడితేనే బావుంటుంది" అన్నాడు పరాంకుశం గర్వంగా.

"ఎంతైనా ఇంటర్వ్యూ నాతో అయినప్పుడు మీరే ఎక్కువగా మాట్లాడేస్తే బావుంటుందాండీ?...."

పరాంకుశం చిరాగ్గా చూశాడు.

"మీ రచనల ద్వారా పాఠకులకి, మా శ్రోతలకి మీ తెలివితేటల గురించి ఈపాటికి తెలిసిపోయే ఉంటుంది. కానీ మా తెలివితేటల గురించి వాళ్లకెలా తెలుస్తుంది? మాక్కూడా సాహిత్యం అంటే తెలుసని వాళ్లకి తెలియొద్దూ?.... ఇంతకీ మీకు ప్రోగ్రాం చెయ్యాలని ఉందా లేదా?"

"ఉందండి....."

ఇంటర్వ్యూ మొదలయింది. ఇందాకటి ప్రశ్నే మళ్లీ అడిగి "మీరేమంటారు?" అన్నాడు పరాంకుశం.

"అవునంటాను" అన్నాడు ఏడుపు మొహంతో శంభుశ్రీ.

"చాలా మంది నోటమ్మట వింటుంటాం, సామాజిక స్పృహ ఉన్న రచనలు అని. సామాజిక స్పృహ ఉన్న రచన అంటే మన చుట్టూ జరుగుతూ ఉన్న విషయాల గురించీ, సమాజంలో జరిగే అవకతవకల గురించీ రాయడమని నేను అంటాను. మీరేమంటారు?"

"సామాజిక స్పృహ ఉండే రచనల గురించి చెప్పాలంటే...."

"డబ్...డబ్...డబ్..."
"సార్! రికార్డింగు చేస్తుంటే ఏదో డబ్ డబ్ అంటూ శబ్దం వస్తుంది...."
వెంకటేశం కంగారుగా అరిచాడు.
"నేనేలేవయ్యా.....నా నెత్తిని మైకుకేసి కొట్టుకుంటున్నా....." అని శంభుశ్రీ వంక చూసి "మీరు మాకు పనికిరారండీ.... కాంట్రాక్ట్ కాన్సిల్, మీ ప్రోగ్రాం కాన్సిల్" అన్నాడు పరాంకుశం విసురుగా లేచి రికార్డింగ్ రూములోంచి బయటికి వెళ్లిపోతూ.

* * *

శంభుశ్రీని పంపించేసి వెంకటేశం, పరాంకుశం మరో రచయితని పట్టుకొచ్చారు. ఇంటర్వ్యూ ప్రోగ్రాం గురించి.
వెంకటేశం టేపు ఆన్ చేశాడు. ఇంటర్వ్యూ మొదలయింది.
"నమస్కారమండీ.... ఓ మీరు కూడా నమస్తే పెడ్తున్నారా? హహహ..... మా మొదటి ప్రశ్నండీ.... మీరు వెరైటీ కోసం సస్పెన్స్ నవలలు రాయడం మొదలు బెట్టారు.... అవునంటారా?. ..." అడిగాడు పరాంకుశం.
"ఒఒ....." అన్నాడు రచయిత.
"అవునంటున్నారా?... వెరీగుడ్.... రచయితల రచనల్లో జీవితానుభవాలు ప్రతిబింబించి తీర్తాయి. మీ రచనల్లో కూడా మీ జీవితానుభవాలు ప్రతిబింబిస్తాయని నేనంటాను. మీరేమంటారు?... ఓహ్... అవునన్నట్టు తల ఊపుతున్నారా? సామాజిక స్పృహ ఉంటే రచనలు అంటే సమాజంలో జరిగే అవకతవకలు ప్రతిబింబించే రచనలే కాదండీ?...."
"ఒఒఒ...అ"
"అవునని అంటున్నారా... మరో ప్రశ్న..."
ఇంటర్వ్యూ అంతా ఇలానేసాగింది. ఆ ఇంటర్వ్యూ పరాంకుశంకి, వెంకటేశానికి చాలా తృప్తిని ఇచ్చింది. రేడియోస్టేషనులోని మిగతా స్టాఫ్ వాళ్లిద్దర్నీ చాలా మెచ్చుకున్నారు అటువంటి మంచి ఇంటర్వ్యూ చేసినందుకు.
రచయిత ఆ ఇంటర్వ్యూలో అస్సలు మాట్లాడలేదు. ఎలా మాట్లాడతాడు? పాపం, అతను మూగవాడు కదా!!
ఆ ఇంటర్వ్యూ రేడియోలో ప్రసారం అయ్యాక శ్రోతలంతా దుమ్మెత్తి పోశారనుకోండి - అది వేరే విషయం.

* * *